09-08-2023 ప్రాత:మురళి ఓంశాంతి "బాప్ దాదా" మధువనం

"మధురమైన పిల్లలూ - ఎప్పుడైతే దేహీ-అభిమానులుగా అవుతారో అప్పుడే జ్ఞాన ధారణ జరుగుతుంది, దేహీ-అభిమానులుగా అయ్యే పిల్లలకే తండ్రి స్మృతి ఉంటుంది"

ప్రశ్న:- ఏ ఒక్క పొరపాటు కారణముగా మనుష్యులు ఆత్మను నిర్లేపి అని అన్నారు?

జవాబు:- మనుష్యులు ఆత్మయే పరమాత్మ అని అన్నారు, ఈ పొరపాటు కారణంగానే ఆత్మను నిర్లేపిగా భావించారు, కానీ నిర్లేపి అయినవారు ఒక్క శివబాబాయే, వారికి సుఖ-దుఃఖాల, తీపి-చేదుల అనుభవం ఉండదు. ఆత్మ అయితే ఫలానా వస్తువు పుల్లగా ఉంది అని అంటుంది. తండ్రి అంటారు, నాపై ఏ వస్తువు యొక్క ప్రభావము పడదు, నేను అన్ని రకాల ప్రభావాల నుండి నిర్లిప్తమైనవాడిని, జ్ఞానసాగరుడిని, ఆ జ్ఞానాన్నే మీకు వినిపిస్తాను.

పాట:- భాగ్యాన్ని మేల్కొలుపుకొని వచ్చాను... (తక్దీర్ జగాకర్ ఆయీ హూ...)

ఓం శాంతి. ఈ విధముగా ఎవరు అన్నారు? ఆత్మలు ఈ ఇంద్రియాల ద్వారా అన్నారు. ఆత్మ శాంతి స్వరూపము. ఆత్మనైన నాకు ఈ శరీరము లభిస్తుంది, అప్పుడు మాట్లాడుతాను, శరీరము ద్వారా అనేక రకాల కర్మలను చేస్తాను. మొట్టమొదట ఈ నిశ్చయాన్ని ఏర్పరచుకోవాలి. ఇతర సత్సంగాలలో మనుష్యులు మనుష్యులకు వినిపిస్తారు, దేహధారులు మాట్లాడుతారు. ఫలానా మహాత్మ కూర్చున్నారు అని అంటారు. ఇక్కడ అటువంటి విషయాలు లేవు. మీరు - నేను ఒక ఆత్మను, ఈ శరీరము ఇంద్రియాలతో కూడుకున్నది అని భావిస్తారు. ఆత్మ పరమపిత పరమాత్మ ద్వారా వింటూ ఉంది, వారికి శివ అన్న ఒక్క పేరే ఉంది. ఈ సమయంలో పిల్లలు వినడానికి కూర్చున్నారు. ఎవరు వినిపిస్తారు? అనంతమైన తండ్రి. పరమపిత పరమాత్మ అని అన్నప్పుడు బుద్ధియోగము పైకి వెళ్తుంది. శివుడు అనగా బిందువు. ఆత్మ కూడా బిందువే, పరమాత్మ కూడా బిందువే. కానీ వారిని పరమపిత పరమాత్మ అని అంటారు. వారు తండ్రి అవుతారు మరియు ఆత్మలు పిల్లలు అవుతారు. ఆత్మనైన నేను ఈ శరీరము ద్వారా నా పారలౌకిక తండ్రికి సంతానముగా అయ్యాను అని భావించాలి. పిల్లలైన మీరు దేహీ-అభిమానులుగా అవ్వవలసి ఉంటుంది. ఇతర స్థానాలన్నింటిలోనూ మనుష్యులు మనుష్యులకు అర్థం చేయిస్తారు. గీతను చదివేవారు ఎవరైనా ఉంటే, వారు కూడా గీతను గుర్తు చేసుకుని గీతలో భగవంతుడు ఇలా, ఇలా చెప్పారు అని అంటారు. భగవంతుడు సాకారములో ఈ గీతను వినిపించారు అని భావిస్తారు. కొందరు కూర్చుని వేద-శాస్త్రాలను వినిపిస్తారు. వేదాలనైతే మనుష్యులు రచించారు. నిరాకార భగవంతుడు వేదాలను తయారుచేయరు. వ్యాసుడు మానవుడే కదా. వ్యాసుడిని పరమాత్మ అని అనరు. పరమపిత పరమాత్మ బిందువు. పిల్లలు సాకారములో ఉన్నారు, సాకార రూపధారులు. తండ్రి నిరాకారుడు.

తండ్రి అంటారు, నేను ఎప్పుడూ చిన్నగా, పెద్దగా అవ్వను. మీరు చిన్నగా, పెద్దగా అవుతారు. నన్ను పరమపిత అనే అంటారు. మనుష్యులు మొదట పిల్లలుగా అయి, ఆ తర్వాత పెద్దయ్యాక తండ్రిగా అవుతారు, ఆ తర్వాత మళ్ళీ పిల్లలుగా అవుతారు. నేనైతే ఎల్లప్పుడూ తండ్రిగానే ఉంటాను, నేను బాలునిగా అవ్వను. నాకు శివ అన్న ఒక్క పేరే ఉంది. మీకు 84 పేర్లు ఉంటాయి ఎందుకంటే 84 జన్మలు తీసుకుంటారు. పరమపితనైన నేను బిందురూపుడిని. కేవలం పూజ కొరకు భక్తి మార్గం వారు పెద్ద రూపాన్ని తయారుచేసి పెట్టారు. ఏ విధంగా కొందరి చిత్రాలను పెద్దగా తయారుచేస్తారు కదా. బుద్ధునికి చాలా పెద్ద చిత్రాన్ని తయారుచేస్తారు. అంత పొడవైన మనిషి అయితే ఉండరు. ఆ విధంగా గౌరవాన్ని ఇస్తారు. వారు చాలా గొప్పవారు అని భావిస్తారు. తండ్రి అయితే ఉన్నతోన్నతమైనవారు, వారు అందరికన్నా పెద్ద పరమపిత పరమ ఆత్మ. తండ్రి కూర్చుని తమ పరిచయాన్ని ఇస్తారు - నన్ను శివ అని అంటారు. మేము నిరాకారుడైన శివబాబా సమ్ముఖములోకి వెళ్తాము అని మీరు భావించాలి - అని పిల్లలకు అర్థం చేయించడం జరుగుతుంది. నన్ను ఎల్లప్పుడూ పరమపిత పరమాత్మ అనే అంటారు. నేను మనుష్య సృష్టికి బీజరూపుడిని. పరమ ఆత్మ కూర్చొని అర్థం చేయిస్తారు. ఆత్మకే జ్ఞానము ఉంది. పరమపిత పరమ ఆత్మ (పరమాత్మ) అని గానం చేస్తారు కూడా, వారు జ్ఞానసాగరుడు. మనకు జ్ఞానాన్ని వినిపిస్తున్నారు. మొట్టమొదట ఆత్మాభిమానులుగా ఉండాలి. దేహాభిమానులుగా అవ్వకూడదు. కానీ డ్రామానుసారముగా మీరు దేహాభిమానులుగా అవ్వవలసిందే. ఇప్పుడు మళ్ళీ తండ్రి దేహీ-అభిమానులుగా తయారుచేస్తారు.

మీరందరూ పిల్లలే. ఇతను కూడా సంతానమే. ఆత్మ పరమపిత పరమాత్మ అయిన తాతగారి నుండి వారసత్వాన్ని తీసుకుంటుంది. లౌకిక సంబంధంలో కేవలం కుమారులకే వారసత్వం లభిస్తుంది, కన్యకు లభించదు. అనంతమైన తండ్రి అంటారు, మీరందరూ ఆత్మలు, మీలో ప్రతి ఒక్కరికీ హక్కు ఉంది. మీరు పరమపిత పరమాత్మ అయిన నాకు చెందినవారిగా ఉండేవారు మరియు ఇప్పుడూ ఉన్నారు. ఓ గాడ్ ఫాదర్, ఓ పరమపిత పరమాత్మ అని అంటారు కదా. మహిమ చేస్తారు. ఎవరు చేస్తారు? ఆత్మ. ఆ లౌకిక తండ్రి శరీరానికి చెందినవారు, వీరు ఆత్మల తండ్రి. ఓ పరమపిత పరమాత్మ అని ఆత్మ పిలుస్తుంది. అవినాశీ తండ్రిని స్మృతి చేస్తూనే వచ్చారు ఎందుకంటే రావణ రాజ్యంలో దుఃఖమే దుఃఖము ఉంది. ఎప్పటినుండైతే రావణ రాజ్యము ప్రారంభమవుతుందో, అప్పటి నుండి స్మృతి చేయడం మొదలవుతుంది. స్మృతి అయితే తండ్రినే చేయాలి ఎందుకంటే వారసత్వం తండ్రి నుండే లభిస్తుంది. ఇక్కడైతే మనుష్యులకు అనేకుల స్మృతి ఉంటుంది. గురువులు ఆ ఒక్కరి స్మృతిని మరిపింపజేస్తారు. ఒకవేళ వారు సర్వవ్యాపి అయినట్లయితే మరి భగవంతుడు లేక తండ్రి అని ఎవరిని అనాలి? తండ్రి ఘడియ-ఘడియా చెప్తూ ఉంటారు - పిల్లలూ, దేహీ-అభిమానులుగా అవ్వండి, లేస్తూ-కూర్చుంటూ తండ్రినైన నన్ను స్మృతి చేయండి. నేను శ్రీమతంపై నడుస్తున్నాను, ఆత్మనైన నేను బాబా స్మృతిలో తింటున్నాను అని భావించండి. స్మృతి ద్వారా వికర్మలు వినాశనమవుతాయి. లక్ష్యము చాలా గొప్పది. యోగము అనేది సామాన్యమైన విషయమేమీ కాదు. మనుష్యులు తండ్రి పేరునే మాయం చేసేసారు. శ్రీకృష్ణుడు వారికి సంతానము అవుతారు. ఇంత గొప్ప ప్రారబ్ధాన్ని తప్పకుండా తండ్రియే ఇచ్చారు.

తండ్రి అర్థం చేయిస్తారు - దేహ సహితంగా దేహపు సర్వ ధర్మాలనూ మర్చిపోండి. ఈ పేర్లన్నీ తర్వాత పెట్టబడినవి. కావున పరమపిత పరమాత్మ ద్వారా మనము ఈ జ్ఞానాన్ని చదువుతున్నాము అని భావించాలి. మేము ఒక ఆత్మ అని భావించే ఈ విధమైన స్కూలు ఇంకేదీ లేదు. మొదట సతోప్రధానంగా ఉండేవారని, తర్వాత సతో, రజో, తమోలలోకి వస్తారని మీకు తెలుసు. మాలిన్యము ఆత్మలో చేరుతుంది. నాలోనైతే మాలిన్యము ఎప్పుడూ చేరదు. నేను సదా సత్యమైన బంగారముగా ఉంటాను. మీ ఆత్మలన్నీ ఈ సమయంలో ఇనుప యుగానికి చెందినవిగా అయిపోయాయి. మమ్మా కూడా ఏమంటారంటే - నేను శివబాబా నుండి ఏదైతే విన్నానో, అదే వినిపిస్తున్నాను. శివబాబా స్వయం జ్ఞానసాగరుడు. ఇవి బాగా అర్థం చేసుకోవలసిన విషయాలు. తప్పకుండా మనం బాబాకు చెందినవారిగా అయ్యాము, వారు మనల్ని చదివిస్తారు. బాబా ద్వారా చదువుకుని మనం జీవన్ముక్తులుగా అవుతాము. జీవన్ముక్తులు అనగా ఈ శరీరములోకైతే రావాలి కానీ సుఖాన్ని అనుభవిస్తారు. ముక్తి అందరికీ లభిస్తుంది కానీ జీవన్ముక్తిలోకి నంబరువారుగా వస్తారు. ముక్తులుగా అయితే ఆత్మలందరూ అవుతారు. దుఃఖము నుండి అర్ధకల్పం కొరకు ముక్తులుగా చేస్తారు. మిమ్మల్ని విముక్తులుగా చేసి జీవన్ముక్తులుగా తయారుచేస్తాను అని అంటారు. ఆ తర్వాత కొందరు కొన్ని జన్మలు తీసుకుంటారు, కొందరు కొన్ని జన్మలు తీసుకుంటారు. జీవన్ముక్తులుగా అయితే అందరూ అవుతారు. సద్గతిదాత ఒక్కరే. ధర్మ స్థాపకులు ఎవరెవరైతే ఉన్నారో, వారందరూ పునర్జన్మలు తీసుకుంటూ-తీసుకుంటూ ఇప్పుడు తమోప్రధానంగా అయ్యారు. నేను వచ్చి అందరినీ ఈ దుఃఖాల నుండి విడిపిస్తాను, అందుకే నన్ను ముక్తిప్రదాత అని అంటారు, ముక్తి-జీవన్ముక్తి దాత అని అంటారు. ముక్తి అనగా మన ఇల్లు అయిన సైలెన్స్ ధామానికి వెళ్ళడము. తండ్రి కూడా పరంధామం నుండే వస్తారు, దానిని పరలోకము అని అంటారు. మీరు నిర్వాణధామాన్ని మరియు స్వర్గధామాన్ని, రెండింటినీ స్మృతి చేస్తారు. స్వర్గము మరియు నరకము ఇక్కడే ఉంటాయి. ఇది నరకము అని ఈ సమయంలో అందరూ భావిస్తారు. ఎంత దుఃఖాన్ని పొందుతూ ఉంటారు. గరుడ పురాణంలో చాలా ఆసక్తికరమైన విషయాలను రాసారు, తద్వారా మనుష్యులకు భయం కలిగి పాపాలు చేయడం నుండి రక్షింపబడతారు అని ఇలాంటి-ఇలాంటి విషయాలను కూర్చొని తయారుచేసారు. ద్వాపరము నుండి ఈ శాస్త్రాలను తయారుచేయడం మొదలుపెడతారు. తండ్రి అంటారు, నేను వచ్చి బ్రహ్మ ద్వారా బ్రాహ్మణ ధర్మాన్ని రచిస్తాను. వారే తర్వాత సూర్యవంశీయులుగా, చంద్రవంశీయులుగా అవుతారు. ఈ రెండు యుగాలలోనూ ధర్మ స్థాపన చేసేవారెవరూ రారు, ఆ తర్వాత ఒకరి వెనుక ఒకరు అందరూ నంబరువారుగా వస్తారు మరియు తమ-తమ ధర్మాలను తెలుసుకుంటారు. ఈ దేవీ-దేవతా ధర్మము కనుమరుగైపోతుంది, అప్పుడిక తమను తాము దేవతలుగా పిలుచుకోలేరు. పతితులు తమను తాము శ్రీశ్రీగా లేక శ్రేష్ఠులుగా ఎలా పిలుచుకోగలరు? తండ్రియే శ్రేష్ఠముగా తయారుచేస్తారు. దేవీ-దేవతలను శ్రేష్ఠులు అని అంటారు. వారి చిత్రాలు కూడా ఉన్నాయి, కానీ దేవీ-దేవతా ధర్మము ఎప్పుడు ఉండేది, దానిని ఎవరు స్థాపించారు అన్నది అర్థం చేసుకోరు. సత్యయుగ ఆయువును పెంచేసారు.

ఇప్పుడు బాబా అంటారు - పిల్లలూ, స్వయాన్ని ఆత్మగా భావించండి, తండ్రిని స్మృతి చేయండి. ఇప్పుడు ఆట

పూర్తవుతుంది. ఇప్పుడు ముక్తి-జీవన్ముక్తుల గేట్లు తెరుచుకుంటున్నాయి అన్నది మీరు చూడడం లేదా? ముక్తి-జీవన్ముక్తి దాత అయితే ఒక్కరే. ఇక్కడ చూడండి, జగన్మాత అనే టైటిల్ ను కూడా కొందరికి ఇస్తూ ఉంటారు. వాస్తవానికి జగదాంబ వీరు కదా. ఈ విధంగా జగత్ పిత కూడా, శిక్షకుడు కూడా మరియు జగత్ గురువుగా కూడా అన్నవారు ఇంకెవ్వరూ ఉండరు. మనుష్యులు స్వయంపై ఎన్నో పేర్లను పెట్టించుకుంటారు కానీ వారు అలా లేరు. ఆ లక్ష్మీ-నారాయణులు ఎక్కడ, స్వయానికి ఆ టైటిల్స్ ను పెట్టుకునే ఈ వికారులు ఎక్కడ. మనుష్యులు ఎంత బుద్ధిహీనులుగా అయిపోయారు! ఆది సనాతన దేవీ-దేవతా ధర్మాన్ని మరిచి వారి టైటిల్స్ ను తమపై పెట్టుకుంటారు. వాస్తవానికి ఉన్నతోన్నతమైన పదవి ఒక్కరిదే, సద్గతి దాత ఒక్కరే. రాముడు అన్నా అది ఆ ఒక్క నిరాకారుడే.

తండ్రి అంటారు, భారతవాసులకు తమ ధర్మాన్ని ఎప్పుడు మరియు ఎవరు స్థాపించారు అనేది తెలియదు. కొందరు ఒక దేవిని తలచుకుంటారు, కొందరు శ్రీకృష్ణుడిని తలచుకుంటారు, కొందరు గురువును తల్చుకుంటారు. గురువు ఫోటోను కూడా పెట్టుకుంటారు. మీకు చిత్రాలతో పని లేదు. ఎవరికైతే ఏ చిత్రమూ లేదో, వారే విచిత్రుడు. ఆత్మ విచిత్రమైనది. ఏ విధంగా తండ్రి విచిత్రులో, అలా పిల్లలు కూడా విచిత్రులు. ఆత్మయే వింటుంది. బాబా ఈ తనువును లోన్ గా తీసుకున్నారు. వారు అంటారు - ప్రకృతి ఆధారము లేకుండా నేను జ్ఞానాన్ని ఎలా ఇవ్వను? రాజయోగాన్ని ఎలా నేర్పించను? భగవంతుడు అని నిరాకారుడినే అంటారు. పతిత ప్రపంచంలోకే వారు రావలసి ఉంటుంది. శ్రీకృష్ణుడిని రావి ఆకుపై సాగరములో తేలుతూ వచ్చినట్లుగా చూపిస్తారు, ఇటువంటి విషయమేమీ లేదు. శ్రీకృష్ణుడు విశ్వమంతటికీ మొదటి యువరాజు. అక్కడ ఇంకే ధర్మమూ లేదు. అక్కడ అద్వైత రాజ్యము ఉంటుంది, అది తర్వాత ద్వైతముగా అవుతుంది, ఆ తర్వాత అనేక రకాల ధర్మాలు స్థాపన అవుతూ ఉంటాయి. కావున బాబా ఈ శరీరములోకి వచ్చి మనల్ని చదివిస్తారని పిల్లలు అర్థం చేసుకోవాలి. బాబా అంటారు, నేను అశరీరిని, ఈ శరీరము ద్వారా మీకు జ్ఞానాన్ని ఇస్తాను. నేను జ్ఞాన సాగరుడిని. ఈ విషయాలన్నీ తండ్రి కూర్చొని అర్థం చేయిస్తారు. కేవలం ఈశ్వరుడు లేక పరమాత్మ అని అన్నట్లయితే తండ్రి సంబంధాన్ని మర్చిపోతారు. పరమాత్మ తండ్రి, వారి ద్వారా వారసత్వం లభిస్తుంది - ఇది మర్చిపోతారు. వారు మన తండ్రి, రచయిత, మనం వారి రచన. వారు రచించారు. ఎవరో ఒక రచయిత ఉంటారు కదా. బాబా అర్థం చేయించారు - పురుషుడు హద్దులోని బ్రహ్మ, అతను పిల్లలను రచిస్తారు, మొదట స్త్రీని దత్తత తీసుకుంటారు, తర్వాత ఆమె ద్వారా పిల్లలను రచిస్తారు. బాబా కూడా అంటారు, నేను ఇతని ద్వారా రచనను రచిస్తాను. స్త్రీ అయితే తప్పకుండా కావాలి కదా. బాబాను - నీవే తల్లివి, తండ్రివి అని అంటారు, కావున ఇతను (బ్రహ్మ) తల్లి అయినట్లు, వీరి ద్వారా దత్తత తీసుకుంటారు. అందుకే మిమ్మల్ని బ్రహ్మ ముఖవంశావళి అని అంటారు. మీరు వీరి ద్వారా తండ్రికి చెందినవారిగా అయ్యారు. ఇవి చాలా అద్భుతమైన విషయాలు. శాస్త్రాలలో ఇవి లేవు. నన్ను నాలెడ్జ్ ఫుల్, సర్వమూ తెలిసినవారు అని అంటారు. పరమాత్మకు అందరిలో ఉన్న విషయాలు తెలుసు, వారు థాట్ రీడర్ (ఆలోచనలను పసిగట్టగలిగినవారు) అని భావిస్తారు. కానీ ఇంతమందికి థాట్ రీడర్ గా ఎలా అవుతారు? తండ్రి అంటారు, నేను మనుష్య సృష్టికి బీజరూపుడిని. నేను చైతన్యమును, సత్యమును. ఆత్మ కూడా చైతన్యమైనది. శరీరము అసత్యమైనది, ఘడియ-ఘడియా మారుతూ ఉంటుంది. ఆత్మ మరణించదు. ఆత్మ ఈ జ్ఞానాన్ని గ్రహిస్తుంది.

తండ్రి అర్థం చేయిస్తారు, పరమపిత పరమాత్మనైన నేను నిర్లేపిని అనగా సుఖ-దుఃఖాలు లేక తీపి-చేదు పదార్థాల ప్రభావము నాపై ఉండదు. నేను ఈ ప్రభావాలన్నింటి నుండి నిర్లిప్తమైనవాడిని, జ్ఞానసాగరుడిని. మనుష్యులేమో - ఆత్మ నిర్లేపి ఎందుకంటే ఆత్మ మరియు పరమాత్మ ఒక్కటే అని భావిస్తారు. ఒకరు అలా అనేటప్పటికి ఇక మిగిలినవారంతా వారి వెనుక ఫాలో చేస్తూ ఉంటారు. తండ్రి అంటారు, నేను నిర్లేపిని, నాకు ఏదీ పుల్లగా లేక ఉప్పగా అనిపించదు. ఫలానా వస్తువు పుల్లగా ఉందని ఇతని ఆత్మ అంటుంది. నాలో మొత్తం సృష్టి యొక్క జ్ఞానము ఉంది, దానిని ఆత్మలకు చదివిస్తాను. ఆత్మలమైన మనము పరమపిత పరమాత్ముని ద్వారా వింటున్నాము అని మీ లోని ప్రతి ఒక్కరూ అర్థం చేసుకోవాలి. ఇక్కడ తప్పకుండా భగవానువాచ ఉంది. భగవంతుడు, రచయిత ఒక్కరే అని నిశ్చయము ఏర్పరచుకోవాలి.

మొట్టమొదటి ముఖ్యమైన విషయము భారత్ కు సంబంధించినది. భారత్ ను అవినాశీ ఖండము అని అంటారు. ఈ భారత్ పతిత-పావనుడైన తండ్రికి జన్మస్థలము. ఇది చాలా ఉన్నతమైన ఖండము. ఇక్కడ లక్ష్మీ-నారాయణుల రాజధాని ఉంటుంది. తండ్రి దేవీ-దేవతా ధర్మము యొక్క అంటును మళ్ళీ కడుతున్నారని పిల్లలైన మీకు తెలుసు. ఈ ధర్మానికి చెందినవారు ఎవరైతే ఉంటారో, వారే వచ్చి వారసత్వాన్ని తీసుకుంటారు, దీనిని అంటు కట్టడము అని అంటారు. బాబా అర్థం చేయించారు - దేహీ-అభిమానులుగా అవ్వాలి. బాబా మనల్ని చదివిస్తున్నారు. మనం ఈ

చెవులతో వింటాము, చదువుకుంటాము, చదివిస్తాము. అచ్ఛా!

మధురాతి-మధురమైన సికీలధే పిల్లలకు మాత-పిత బాప్ దాదాల ప్రియస్మృతులు మరియు గుడ్ మార్నింగ్. ఆత్మిక పిల్లలకు ఆత్మిక తండ్రి నమస్తే.

ధారణ కొరకు ముఖ్య సారము:-

1. చిత్రాన్ని మరిచి విచిత్రులుగా అయి విచిత్రుడైన తండ్రిని స్మృతి చేయాలి. దేహ సహితముగా దేహపు సర్వ ధర్మాలనూ బుద్ధి ద్వారా మరిచిపోవాలి, దేహీ-అభిమానులుగా ఉండే అభ్యాసము చేయాలి.

2. దేవీ-దేవతా ధర్మపు అంటు కట్టబడుతోంది, కావున పావనంగా తప్పకుండా అవ్వాలి. దైవీ గుణాలను ధారణ చేయాలి.

వరదానము:- అలౌకిక జీవితపు స్మృతి ద్వారా వృత్తి, స్మృతి మరియు దృష్టిని పరివర్తన చేసుకునే మరజీవా భవ

బ్రాహ్మణ జీవితాన్ని అలౌకిక జీవితము అని అంటారు, అలౌకికము అంటే అర్థము - ఈ లోకానికి చెందినదిగా లేకుండా ఉండడము. దృష్టి, స్మృతి మరియు వృత్తి అన్నింటిలోనూ పరివర్తన ఉండాలి. సదా ఆత్మ రూపంలో సోదరులము అన్న వృత్తి లేక సోదరీ-సోదరులము అన్న వృత్తి ఉండాలి. మనమంతా పరస్పరము ఒకే పరివారానికి చెందినవారము - ఈ వృత్తి ఉండాలి మరియు దృష్టి ద్వారా కూడా ఆత్మను చూడండి, శరీరాన్ని కాదు - అప్పుడే మరజీవా అని అంటారు. ఇటువంటి శ్రేష్ఠ జీవితము లభించింది కావున ఇక పాత జీవితము గుర్తుకు రాదు.

స్లోగన్:- సదా శుద్ధమైన ఫీలింగ్ లో ఉన్నట్లయితే అశుద్ధమైన ఫీలింగ్ అనే ఫ్లూ మీ దరికి కూడా చేరలేదు.